21072024-MAI-04_Layout 1 7/21/2024 2:28 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఉద్యోగాలపై మేధావుల పాప్యులిజం

టంకశాల అశోక్

పాప్యులిజం అనే మాటను సాధారణంగా రాజకీయ నాయకులతో ముడిపెట్టి మాట్లాడుతుంటాము. అటువంటిది మేధావులతో ముడిపెట్టడం ఆశ్చర్యంగా తోచవచ్చు. కానీ వారు ఉద్యోగ, ఉపాధి విషయాలపై వ్యవహరిస్తున్న తీరును చూసినప్పుడు ఇంతకన్న సరైన పదం మరొకటి కనిపించటం లేదు. ఇప్పుడు ఉద్యోగ, ఉపాధులపై మేధావులది పాప్యులిస్టు ధోరణిగా మారుతున్నది. అట్లా ఎందుకో విచారిద్దాము. ఉద్యోగార్థులైన యువతీ యువకులది జీవన ఆరాటం. అది వారికి తక్షణ సమస్య అయినందున ఉద్యోగ-ఉపాధి రంగంపై సమగ్ర దృష్టి తీసుకోవాలని, థియరెటికల్‌గా ఆలోచించాలని, సమస్యకు మౌలిక పరిష్కారాలను అన్వేషించాలని వారికి బోధనలు చేయలేము. అటువంటి అవగాహనలు మేధావులు అయినవారికి మాత్రం తప్పక ఉండాలి. అట్లా ఉన్నప్పుడు కొన్ని జరుగుతాయి. వారు నిరుద్యోగులకు తప్పు అవగాహనలు కల్పించరు. రెచ్చగొట్టరు. వారి పట్ల సానుభూతి చూపుతూనే నిరుద్యోగ సమస్యపై అవసరమైన సమాచారాలను వారి ముందుంచుతారు. అందులో తక్షణ దృష్టితో పాటు సమగ్రమైన దీర్ఘకాలిక దృష్టి కూడా ఉంటుంది. అటువంటి వారే నిరుద్యోగుల బాగును నిజంగా కోరే నిజాయతీ గల మేధావులవుతారు. కాని మన మేధావులు ఈ విషయంలో పాప్యులిస్టులుగా మారుతున్నారు.

మైన సంబంధాలు, ఒకవేళ పార్టీలతో ప్రత్యక్ష సంబంధాలు లేకపోయినా ఈ మొత్తం వలయంలో చిక్కుకుని సమయానుకూలంగా వ్యవహరించటం. మేధావులకు తప్పనిసరి అయిన నిష్పాక్షికతను, స్వార్థరాహిత్యాన్ని వదలివేయటం వంటివి. ఇవి జరిగినప్పుడు సహజంగానే, పైన చెప్పుకున్న తరహా గత కాలపు మేధావి లక్షణాలకు వారు దూరమవుతారు. ఇదొక స్పష్టమైన పరివర్తన. ఇటువంటి స్థితి నుంచే ఈ కొత్త దశలో వారి పాప్యులిస్టు మేధావితనం ముందుకొచ్చింది.

> **మొదట ప్రస్తావించిన ఉద్యోగ, ఉపాధి అంశాన్నే తీసుకుని ఈ విషయం చర్చిద్దాము. ఉదాహరణకు తెలంగాణలో 30 లక్షల మంది నిరుద్యోగులున్నారన్నది కొందరి అంచనా. అది నిజమైనా కాకపోయినా వారు భారీ సంఖ్యలో ఉన్నారనే మాట వాస్తవం. ఎప్పుడైనా, ఎక్కడైనా విద్యావంతులకు జీవనోపాధి లభించేది మూడు విధాలుగా. ఒకటి ప్రభుత్వరంగం, రెండు ప్రైవేటురంగం, మూడు స్వయం ఉపాధి రంగం.**

వీటిలో మొదటిది ఎప్పుడైనా పరిమితమే. రెండవది యథాతథంగా అపారమైనది. కానీ టెక్నాలజీ ఆధునీకరణ వల్ల అవకాశాలు వేగంగా తగ్గుతున్నాయి. స్వయం ఉపాధి రంగం కూడా అపారమైనదే అయినా దానిపై సైతం టెక్నాలజీ ఆధునీకరణలు ప్రభావం చూపుతున్నాయి. తిరిగి మొదటి అంశానికి వెళ్తే, మన దేశంలో 30 ఏండ్ల నుంచి వచ్చిన ఆర్థిక సంస్కరణలు, పరిపాలనా సంస్కరణల వల్ల ప్రత్యక్ష ఉద్యోగాలు తగ్గటం, ఖాళీలను భర్తీ చేయకపోవటం, కాంట్రాక్టు ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగుల పరిస్థితి పెరిగిపోతున్నది. ప్రభుత్వరంగ సంస్థల మూసివేతలు, ప్రైవేటీకరణలతో సమస్య మరింత తీవ్రమవుతున్నది. నిరుద్యోగ సమస్యను ఎప్పటికప్పుడు పెంచుతున్న ఈ వేర్వేరు ధోరణులు ఏవీ నిలిచిపోయే అవకాశం కనుమాపు మేరలో లేదు. అందుకే యువకులు ప్రాణాలపై సైతం ఆశలు వదులుకొని యుద్ధ క్షేత్రాలైన ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లకు తరలిపోతున్నారు.

ఈ యావత్ పరిస్థితులు మేధావులకు తెలియవని ఎంతమాత్రం భావించలేం. అటువంటప్పుడు వారు చేయవలసినవి మూడున్నాయి. ఒకటి, నిరుద్యోగులకు పూర్తి సానుభూతి తెలుపుతూ వారి ఆందోళనలకు మద్దతు ప్రకటించటం. అది తక్షణ కర్తవ్యం. రెండు, పైన చెప్పుకొన్న నిరుద్యోగ పరిస్థితి కారణాలను వారికి వివరించటం. అది దీర్ఘకాలిక అవసరం. మూడు, అసలు ఈ సమస్య తొలగిపోవటమన్నది మౌలికమైన విషయం గనుక, కేవలం కారణాల వివరణతో పరిష్కారం లభించదు గనుక, వ్యవస్థలో మార్పుల వల్ల గాని ఆ మౌలిక పరిష్కారం జరుగదు గనుక, వారికి అటువంటి అవగాహనలను కల్పించి ఆ దిశగా కదిలించటం. కానీ ఈ మేధావులు అటువంటి పనులేవీ ఎంత మాత్రం చేయటం లేదు. కొన్ని సులభ సూత్రాలను మాత్రం ప్రకటించి నిరుద్యోగులను వంచించి ఆత్మవంచన కూడా చేసుకుంటున్నారు. ఉదాహరణకు వారిలో కొందరు ఉద్యోగ హక్కును ప్రభుత్వాలు చట్టంగానే చేయాలని, అట్లా చేసినట్లయితే నిరుద్యోగులు తమ హక్కు అమలు కోసం కోర్టుకు వెళ్లే వీలుంటుందని అంటున్నారు. ఇది వినేందుకు గొప్పగా తోస్తుంది గాని ఆచరణలో సాధ్యమా? అటువంటి చట్టాలు మన దేశంలో గాని, ఇతర ప్రజాస్వామిక దేశాల్లో గాని ఎక్కడైనా ఉన్నాయా? ఏటా కొన్ని లక్షల మంది డిగ్రీలు చేసి విద్యాసంస్థల నుంచి బయటకు వస్తున్నారు. అన్ని లక్షల మందికి ఏటా ఒక చట్టపరమైన హక్కుగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం జరిగే పనేనా? అందుకే వీరిని పాప్యులిస్టు మేధావులనటం.

ఈ మేధావులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే సమస్య పరిష్కారానికి కొన్ని పనులు చేయవచ్చు. పూర్తి పరిష్కారం కాకున్నా వీలైనంత మేర. యువకులలో, వారి కుటుంబాలలో, సమాజంలో ఈ సమస్య మౌలిక కారణాలపై, అందుకు మౌలిక పరిష్కారాలపై చైతన్యం తీసుకురావటం. తమతో ఏకీభావం గల సంస్థలను వెంట తీసుకోవటం. ఇక కార్యాచరణకు సంబంధించి, ఆర్థిక సంస్కరణల వల్ల, పరిపాలనా సంస్కరణల వల్ల ఎక్కడెక్కడైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో తగ్గుతూ వస్తున్నాయో ఆ చర్యలు నిలువరింపజేయటం. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను బలంగా ఆపటం. ప్రైవేట్‌రంగానికి ఈ దేశపు నేల, నీరు, సహజ వనరులు, ఆర్థిక వనరులు, ప్రభుత్వ రాయితీలు, వ్యాపార సౌలభ్యాలు లభించాలంటే అందుకు తగినట్లు ఉపాధి అవకాశాలను, ఉద్యోగాలను ఇప్పటికన్న గణనీయంగా పెంచి తీరాలన్న చట్టాలు చేసి అమలు జరిగేట్లు చూడటం. కునారిల్లుతున్న వ్యవసాయరంగంలో, గ్రామీణ వృత్తుల ఆధునీకరణ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోతుండటాన్ని అరికట్టి గణనీయంగా పెంచటం. విద్యావంతులకు విస్తృతంగా సాంకేతిక శిక్షణల కల్పన. ఈ విధమైన చర్యల వల్ల గాని ఇంత పెద్ద దేశంలో ఉద్యోగ, ఉపాధి సమస్యలు ఒక మేరకైనా, క్రమక్రమంగానైనా అదుపులోకి రావు.

> **ఉద్యోగ, ఉపాధి సమస్యలు చివరికి సోషలిస్టు దేశాల్లోనూ ఒక మేర ఉన్నాయి. ఇతర వ్యవస్థల గురించి చెప్పనక్కరలేదు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌ను, కర్ణాటకను కుదిపివేస్తున్నది అదే. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలన్న మోదీ ప్రభుత్వం విఫలం కావటానికి కారణం అయన కాదు. అయన పాలిస్తున్న వ్యవస్థ. అమెరికా అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, తన ప్రణాళిక అంటూ గత మంగళవారం ప్రకటించిన 20 సూత్రాలలో, ఔట్ సోర్సింగ్‌ను ఆపివేయగలనంటూ ఇచ్చిన హామీకి కారణం అక్కడి నిరుద్యోగ సమస్య. ఈ సమస్య ప్రస్తుత యూరోపియన్ ఎన్నికల నిన్నింటిని ప్రభావితం చేస్తున్నది. ప్రపంచ మంతటా పరిస్థితి సరేసరి.**

అందువల్ల మేధావులు నిరుద్యోగుల పట్ల కపటత్వాన్ని మానివేయాలి. తమకు నచ్చని పార్టీలపై వారిని రెచ్చగొట్టడం, నచ్చినవారు గెలవగానే మౌనం వహించటం, ఉద్యోగ హక్కు చట్టాలంటూ అసాధ్యమైన పాప్యులిస్టు మాటలతో మభ్యపుచ్చటం వంటివి వారికి తగవు. అందువల్ల తమకేమైనా ప్రయోజనాలు చేకూరుతాయేమో గాని, యువతీ యువకులకు లభించేది శూన్యం.

> ఏ ప్రభుత్వమైనా సరే పేదల అభ్యున్నతి కోసం, వారు గౌరవంగా జీవించటానికి, వారి జీవన ప్రమాణాలను పెంచటానికి కృషి చేస్తుంది. అందుకనుగుణంగా పథకాలను రూపొందిస్తుంది. ప్రాధాన్య క్రమంలో అమలు చేస్తుంది. కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నది. పథకాల పేరిట ప్రజలను ఆకర్షించి, ఓట్లు దండుకున్నది. ఇప్పుడు ఉన్నవారికే పథకాలను వర్తింపజేస్తూ.. పేదలు, సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్న, నిస్సహాయులైన వృద్ధులు, దివ్యాంగులను విస్మరిస్తున్నది.

దివ్యాంగులకు మొండిచెయ్యి

దుర్గం వెంకన్న
62816 24720

పథకాలను కూడా సకలాంగులకే కేటాయిస్తే, దివ్యాంగులు బతికేదెట్టా?

సమాజంలో దివ్యాంగులు, వృద్ధులు నిత్యం వివక్ష ఎదుర్కొంటున్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. కానీ, కాంగ్రెస్ సర్కార్ ఆ బాధ్యతను విస్మరిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగులకు, వృద్ధులకు ఇచ్చిన పింఛన్ పెంపు హామీని నెరవేర్చలేదు. అధికారంలోకి రాగానే ఫ్రీ బస్సు హామీని అమలు చేసిన రేవంత్ సర్కార్.. ఇప్పుడు తాజాగా రైతు రుణమాఫీపై దృష్టిసారించింది. మానవీయ కోణంలో వాటి కంటే ముందే అమలు చేయాల్సిన పింఛన్ పెంపును మాత్రం ఇప్పటికీ పట్టించుకోవడం లేదు.

> **కేసీఆర్ సర్కార్‌పై దుష్ప్రచారం చేసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను మాయమాటలతో మోసం చేసి ఓట్లు వేయించుకున్న రేవంత్ ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదు. నూతన పింఛన్ల కోసం తీసుకున్న దరఖాస్తులూ అటకెక్కాయి.**

తాము అధికారంలోకి వస్తే వెంటనే సాధారణ పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అంతేకాదు, దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని వాగ్దానం చేసి ఓట్లు వేయించుకొని ఇప్పుడు మాట తప్పింది.

ఇటీవల ప్రతి గ్రామంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, అవి మహిళలకు కేటాయిస్తామని, అందుకోసం వారికి 2.50 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఇలాంటి స్వయం ఉపాధి పథకాలు సకాలంలో అమలు చేయకపోవడంతో వారు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. 2014లో కొత్తగా ఏర్పడిన తెలంగాణలో అప్పటి సీఎం కేసీఆర్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అయినా అధికారంలోకి వచ్చిన ఒక్క నెలలోనే వృద్ధులకు రూ.వెయ్యి, దివ్యాంగులకు రూ.1500 పింఛన్‌ను అందజేసిన మహనీయుడు కేసీఆర్. రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధులకు రూ.2,016, దివ్యాంగులకు రూ.3016 పింఛన్‌ను అందించారు. దివ్యాంగుల అవసరాలను గ్రహించి, మానవీయ కోణంలో ఆలోచించి పింఛన్‌ను రూ.4016కు పెంచిన ఆత్మబంధువు కేసీఆర్.

పింఛన్ల మీదే ఆధారపడి జీవిస్తున్న నిస్సహాయులైన వృద్ధులు, దివ్యాంగుల పొట్టకొట్టి, వారి నోటి కాడి బువ్వను రుణమాఫీ పేరిట భూములు ఉన్నోళ్లకు రేవంత్ పంచుతున్నారు. దివ్యాంగులు, వృద్ధులు అడగలేరు, ప్రశ్నించలేరనే ఉద్దేశంతోనే రేవంత్ సర్కార్ ఈ విధంగా వ్యవహరిస్తున్నది. నిస్సహాయులైన వృద్ధులు, దివ్యాంగులు రోడ్డెక్కి నిరసనలు తెలిపే పరిస్థితి రావడం రేవంత్ సర్కార్‌కు సిగ్గుచేటు.

పార్లమెంట్‌లో అంబేద్కర్ గళం!

డాక్టర్ కత్తి పద్మారావు

> 2024-25 కేంద్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో పార్లమెంట్‌లో జరగబోయే చర్చల పట్ల దళిత, బహుజన, మైనారిటీ ప్రజలు ఆసక్తిగా ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా ప్రపంచ దేశాల ఆర్థిక సూచీలో ఇంకా 14వ స్థానంలో ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. మన దేశంలో ఇంకా అస్పృశ్యత, కుల వివక్ష, అత్యాచారాలు, అణచివేత, నిరక్షరాస్యత కొనసాగడానికి ప్రధాన కారణం దేశాన్ని 75 ఏండ్లు పాలించిన వివిధ పాలకవర్గాల ఆర్థిక, సామాజిక దోపిడీ విధానాలే అన్నది సుస్పష్టం.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అస్పృశ్యత నివారణ చట్టం అమలుపై కాని, ఆర్టికల్ 17లోని కుల నిర్మూలన భావాలకు సంబంధించిన అంశాల పట్ల గాని విపక్ష నాయకులైన రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, చిదంబరం తదితరులు పార్లమెంట్‌లో చర్చ లేవనెత్తకపోవడం విడ్డూరం. ఏ రాజ్యాంగాన్ని అయితే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు పార్లమెంట్‌లో తన చేతితో ఎత్తి చూపిస్తున్నాడో.. ఆ రాజ్యాంగంలో ఉన్న ప్రధాన అంశం అస్పృశ్యత లేని భారతదేశాన్ని సృష్టించడమే. అలా సృష్టించాలంటే దళితులకు భూమి పంపిణీ, విద్యాభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, ఉద్యోగ కల్పన, ఉన్నత విద్యావకాశాలు కల్పించడం ప్రధానమైనవి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఈ అంశాలను ఆ రోజుల్లోనే వాదించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. మతసామరస్య వాదం వల్ల అస్పృశ్యత పోతుందా? బౌద్ధ సాంస్కృతిక విప్లవం వల్ల పోతుందా? అనే అంశాన్ని అధికారపక్షం, విపక్షం అర్థం చేసుకోవాలి. దళితులకు భూ పంపిణీ ద్వారానే దేశ సంపద పెరుగుతుందని అంబేద్కర్ చెప్పిన ఆర్థిక సామ్యవాదాన్ని రెండు పక్షాలు అర్థం చేసుకోలేకపోతున్నాయి. నిజానికి అంబేద్కర్ కృషి వల్ల అస్పృశ్యతను ఒక నేరంగా రాజ్యాంగం పరిగణిస్తున్నప్పటికీ.. ఇంకా దేశంలోని లక్షలాది గ్రామాల్లో అస్పృశ్యత వెంటాడుతూనే ఉన్నది. దీనికి స్పష్టమైన కారణాలను పార్లమెంటు చర్చల ద్వారా సాధించలేకపోతున్నారు. అంబేద్కర్ రాజ్యాంగ చర్చల సందర్భంగా సోషలిస్టు సిద్ధాంతాల నుంచి రాజ్యాంగం రూపొందిందని, శాసనాధికారుల నుంచి సోషలిజాన్ని సాధించాలని పేర్కొన్నారు. కానీ, ఆచరణలో ధనస్వామిక శక్తుల అభివృద్ధికే గత ప్రభుత్వాలు పాటుపడ్డాయి. ఈ విధమైన అసమ సమాజ సృష్టి కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాయలేదు. అంబేద్కర్ 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' అనే గ్రంథాన్ని రాజ్యాంగ రచనకు ముందే ప్రచురించారు. అందులో ఆస్తిని జాతీయం చేయాలని.. అప్పుడే ప్రజలకు ఆర్థిక, సాంఘిక న్యాయం జరుగుతుందని చెప్పారు.

సామాజిక అసమానతలతో నిండిన ఈ వ్యవస్థలో కుల, మత, జాతి ఆధారంగా వివక్ష మూపితే ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని రాజ్యాంగ చర్చల్లో అంబేద్కర్ నొక్కి వక్కాణించారు. మతరహిత రాజ్యాంగ పద్ధతే సెక్యులర్ విధానమని రాజ్యాంగ చర్చల్లో ఆయన వివరించారు. మతం వ్యక్తిగతమని, రాజ్యాంగం వైజ్ఞానికంగా, జ్ఞానపరంగా నడవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ సొమ్మును మత బోధనలకు, మత కార్యకలాపాలకు ఉపయోగించరాదని రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ స్పష్టం చేస్తున్నది. సెక్యులరిజం అంటే మత ప్రమేయం లేని రాజ్యం అని అర్థం. దాన్ని ఇరుపక్షాలు ఆచరించవలసిన అవసరం ఉన్నది. వాస్తవానికి పార్లమెంటులో బడుగు వర్గాల జీవన స్థితిగతులను మెరుగుపరచడం కోసమే చర్చ జరగాలి. కానీ, మతపరమైన అంశాలకే ఎక్కువ సమయం కేటాయిస్తూ విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి గురించి, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు మూలమైన మద్యపాన నిషేధం, మత్తుపదార్థాలు వంటి విషయాలపై పార్లమెంట్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్‌తో పాటు రామ్ మనోహర్ లోహియా కూడా కులాధిపత్య భారత రాజకీయ వ్యవస్థ మీద చర్చ పెట్టారు. భారత రాజకీయాల్లో కులం నిర్వహిస్తున్న పాత్రను తక్కువ అంచనా వేయరాదనే అంశాన్ని లోహియా నొక్కిచెప్పారు. దళితుల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయాల్లో ఎక్కువ నిధులు ఇచ్చి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని అంబేద్కర్ చెప్పారు. అందుకు ఆయన మొదటి ప్రణాళికలోనే నిధులను కేటాయించారు. 111 మంది ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఉన్న భారత పార్లమెంటులో దళిత, బహుజనుల ఆర్థిక, సామాజికాభివృద్ధి గురించి వారు ఎక్కువ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరం.

అంబేద్కర్ ఎన్నో కష్టాలకోర్చి, పోరాటాలు చేసి రాజకీయ రిజర్వేషన్లు సాధించారు. అయితే ఆ హక్కులు నేరవేర్చే క్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంపీలు పోరాడుతున్నారా? అనేదే ప్రశ్న. వివిధ పార్టీల్లో ఉన్నప్పటికీ 1989లో ఏపీ దళిత మహాసభ ఆధ్వర్యంలో 1989 ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్‌ను సాధించారు. ఇప్పుడు మళ్లీ అదే ఐక్యత దళిత ఎంపీల్లో కావాలి. అట్రాసిటీ యాక్ట్‌ను దేశంలో బలంగా అమలు జరపాలని వారు వాదించగలగాలి.

> **బీసీ అంటే వెనుకబడిన కులం అని కాదు, వెనుకబడిన తరగతి అని అర్థం. వారు కులాలు కావచ్చు, బౌద్ధులు కావచ్చు, క్రైస్తవులు, ముస్లిం కావచ్చు. స్వాతంత్ర్యం నాటికి వీరి మధ్య ఐక్యత లేదు. వీరికి జనగణన లేదు. మన రాజ్యాంగ నిర్మాత వీరి కోసమే రాజ్యాంగంలో 340 ఆర్టికల్‌ను పొందుపరిచారు.**

ఆ తర్వాత ఈ ఆర్టికల్‌ను అమలు చేయడానికి, బీసీల జనాభా లెక్కలు తేల్చటానికి మొదట కాకా కాలేల్కర్ కమిషన్, 1992 నుంచి మండల్ కమిషన్ అమలవుతూ ఉంది. అయితే ఇప్పటికీ చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ లేదు. అంబేద్కర్ బీసీల కోసమే మొదటి ప్రాధాన్యమిచ్చి 340 ఆర్టికల్, ఆ తర్వాతే ఎస్సీ, ఎస్టీల కోసం 341, 342 ఆర్టికల్‌లను రాజ్యాంగంలో పొందుపరిచారు. బీసీల అభ్యున్నతి కోసం వారి ఆర్థిక, సామాజిక అంశాల మీద, సామాజిక న్యాయం కోసం 340 ఆర్టికల్‌ను తీసుకువస్తే, బీసీలు మత ఛాందసవాదులై, దైవానికి తలవంచి, అగ్రకులాలకు బానిసలై బీసీల విముక్తి ప్రదాత అయిన అంబేద్కర్‌ను మరిచిపోయి మానసిక బానిసత్వంలో బతుకుతున్నారు.

బీసీ సమాజం ఒక గొప్ప సమాజం. వారికి సామాజిక న్యాయం జరగడం కోసం పార్లమెంటులో బహు సంఖ్యాకులుగా ఉన్న బీసీ ఎంపీలు పోరాడవలసిన చారిత్రక అవసరం ఎంతో ఉన్నది. దేశంలో పేద ప్రజలకు ఉచితంగా ధనం ఇవ్వడం కంటే వారిలో ఉన్న వ్యవసాయ కూలీలకు భూమి, యువకులకు గ్రామీణ ఫ్యాక్టరీలు, విద్యావంతులకు ఉద్యోగ కల్పన పెంచాల్సిన అవసరం ఉన్నది. కాంగ్రెస్ మేధావులుగా పేరొందిన చిదంబరం వంటి వారు రాహుల్‌గాంధీతో సహా వామపక్షాలు కూడా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి వాటిపైనే మాట్లాడుతున్నారు గాని, అణగారిపోతున్న దళితులకు అటు గ్రామంలోనూ పని లేదు, ఇటు పట్టణంలోనూ నిల్వ నీడలేదనే విషయాన్ని మరిచిపోతున్నారు. ఇంతటి దుర్భర పరిస్థితుల్లో ఉన్నవారి సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లే అంబేద్కర్, ఫూలే తాత్విక దృష్టి వీరికి కనిపించడం లేదు. రాబోయే బడ్జెట్‌లో దళితులు, మహిళలు, బీసీలను ఉపాధి రంగాల్లో విస్తృతం చేయడం కోసం ప్రతి గ్రామంలో పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు పెట్టాలి. వాటిలో తయారయ్యే వస్తువులను ఇతర దేశాలకు మార్కెట్ చేసే విధానాలను రూపొందించాలి. అంబేద్కర్ ఆర్థిక ప్రణాళిక మార్గంలో దేశ సంపదను అభివృద్ధి చేసుకోవడం కోసం స్వయం ప్రతిపత్తి, స్వయం జీవనం సంస్కృతిని పెంచే మార్గంలో బడ్జెట్ రూపకల్పన కోసం పార్టీలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు పోరాడాల్సిన చారిత్రక సందర్భం ఇది.

ఈ సందర్భంగా అంబేద్కర్ 1937 డిసెంబర్ 31న కాన్పరెన్స్ ఆఫ్ ద డిప్రెస్డ్ క్లాసెస్‌లో అంబేద్కర్ మాట్లాడుతూ దళిత బహుజనులకు, స్త్రీలకు ఆత్మగౌరవం, స్వయం సహాయక శక్తి ఉద్యమ స్ఫూర్తి కావాలని అన్నారు. తమ ముందు మూడు సమస్యలున్నట్టు చెప్పారు. మొదటిది.. హిందూ సమాజంలో అణగారిన వర్గాలు ఏ నాటికైనా సమాన ప్రతిపత్తి పొందుతాయా, లేదా? రెండోది.. వారు జాతీయ సంపత్తిలో సరైన వాటా పొందగలరా, లేదా? మూడోది.. ఆత్మగౌరవ, స్వయం-సహాయక ఉద్యమాల గతి ఏమిటి?

మొదటి అంశానికి సంబంధించి, కుల వ్యవస్థ ఉన్నంతకాలం అది సాధ్యం కాదన్నారు. రెండో అంశానికి సంబంధించి, పెట్టుబడిదారుల నేతృత్వంలోని కాంగ్రెస్ అణగారిన వర్గాల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నంత వరకు ప్రస్తుత ప్రభుత్వం అణగారిన వర్గాల అభ్యున్నతికి ఏదో చేస్తుందని నమ్మలేమని చెప్పారు. దోపిడీకి ఎగబడిన పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఒక యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని అణగారిన వర్గాలవారికి ఉద్బోధించారు. ఇక మూడో అంశానికి సంబంధించి ఒక విషయం జ్ఞాపకం పెట్టుకోవాలని ప్రజలకు సూచించారు. ఉద్యమం వల్ల లాభాలే తప్ప పోగొట్టుకోవడానికి ఏమీ లేదని, వారు చావు భయం పోగొట్టుకోవాలని సలహా ఇచ్చారు. ఆయన ఆశయాల మార్గంలో పార్లమెంట్‌లోని దళిత, బహుజన, మైనారిటీ, లౌకికవాద ఎంపీలు పోరాడాల్సిన అవసరం ఉన్నది.

> **దేశంలో రవాణా వ్యవస్థ పెరుగుతున్నది. ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతున్నది. కానీ, పేద ప్రజలకు రైలులో బోగీలు తగ్గిపోతున్నాయి. అసలు రైళ్ల సంఖ్యే తగ్గిపోతున్నది. అదే సమయంలో విమానాలు పెరుగుతున్నాయి. పేద ప్రజలు ప్రయాణం చేయలేని స్థితిలో ఉన్నారు. దళిత బహుజన ఎంపీలు రైలు మార్గాల విస్తృతి గురించి ఉభయ సభల్లో బలంగా వాదించాలి.**